## క్లుప్తంగా

### రియల్ ఎస్టేట్ నూతన కమిటీ ఎన్నిక

**రఘునాథపాలెం:** రఘునాథపాలెం గ్రామం అండ్ మండల రియల్ ఎస్టేట్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రఘునాథపాలెంలోని ఆర్‌బీజీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించగా... అధ్యక్షుడిగా ఆంగోతు జగ్యా, కార్యదర్శిగా బోడా లక్ష్మణ్‌లతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

### నియామకం

**ఖమ్మం మామిళ్లగూడెం:** తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కమర్తపు మురళి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని పద్మశాలి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్, కొండల్‌రావు, సునీత, సంధ్యారాణి, జి.శ్రీనివాస్, శ్రీధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**తిరుమలాయపాలెం:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ ఆదివారం ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### ఆస్పత్రి నుంచి 'పువ్వాడ' డిశ్చార్జ్

**ఖమ్మంమయూరిసెంటర్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తండ్రి, సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పూర్తి ఆరోగ్యంతో ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నెల రోజుల క్రితం అనారోగ్యంతో అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందగా.. పూర్తిగా కోలుకొని ఇంటికి చేరారు. ఈమేరకు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, తదితరులు హర్షం వ్యక్తం చేసి పువ్వాడకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం



ప్రచారం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

**ఖమ్మంగాంధీచౌక్:** ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ఆదివారం త్రైత సిద్ధాంత – ప్రబోధ సేవా సమితి, ఖమ్మం ఇందూ జ్ఞాన వేదిక కమిటీ నగరంలోని రాధాకృష్ణనగర్, వీఆర్‌కే కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ ప్రతినిధులు సత్యం, నాగరాజు, ఉమేష్, సంజయ్, విజయమ్మ, సుజాత, అశ్విని, ఉమ చందన, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

### సన్నాహక సమావేశం

**ఖమ్మం సహకారనగర్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లు సమ్మె కార్యచరణలో భాగంగా ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదులు, కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తొలుత అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నవ్య, రేణుక, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై కూలిన ధాన్యం లోడు..



కూలిన ధాన్యం బస్తాలు

**కూసుమంచి:** మండలంలోని పాలేరులో ఆదివారం ట్రాక్టర్‌పై తరలిస్తున్న ధాన్యం లోడు బస్తాలు ఒక్కసారిగా కూలి నడిరోడ్డుపై పడిపోయాయి. జక్కేపల్లి నుంచి నర్సింహుల గూడెం మిల్లుకు తరలిస్తున్న క్రమంలో కూలిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామ్ కాగా.. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | దసరా |
| వినోద | విరుపాక్ష |
| సాయిరాం | కిసీ కా బాయ్ కిసీ కీ జాన్ |
| ఆదిత్య | బలగం |
| శ్రీనివాస | రావణాసుర |
| సుందర్ | విడుదల |

- ఖమ్మంగాంధీచౌక్

# ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో చేతివాటం


- మామూళ్లపైనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ల దృష్టి
- కొలతలు తగ్గించి.. ఆపై తక్కువ ఫీజు వసూలు
- ఫలితంగా కేఎంసీ ఆదాయానికి గండి



**ఖమ్మంమయూరిసెంటర్:** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆస్తి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా ఆదాయం సమకూరుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతీ వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం కార్పొరేషన్‌లో వ్యాపారులు అత్యధిక శాతం మంది లైసెన్సులు లేకుండానే వ్యాపారం చేస్తున్నారు. దీంతో అధికారులు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి చేసి వ్యాపారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తుండగా.. కేఎంసీ రెవెన్యూ విభాగంలో సిబ్బంది కొరతతో ట్రేడ్ లైసెన్సుల జారీ, రెన్యువల్ బాధ్యతలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్, కొలతలకు ఒక సహాయకుడిని ఏర్పాటు చేశారు. దీనిని అదునుగా చేసుకొని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లైసెన్సుల జారీలో అవకతవకలకు పాల్పడుతూ కేఎంసీ ఆదాయానికి గండికొడుతున్నట్లు తెలుస్తోంది.

**కొలతల్లో మాయ..**

నూతన మున్సిపల్ చట్టం ప్రకారం ట్రేడ్ లైసెన్సులను వ్యాపారం నిర్వహించే భవనం కొలతల ప్రకారం ఫీజు నిర్ణయించి లైసెన్సు జారీ చేస్తున్నారు. పాత లైసెన్సులను రెన్యువల్ చేసేందుకు కూడా కొత్తగా కొలతలు తీయడాన్ని తప్పనిసరి చేశారు. అయితే కేఎంసీ పరిధిలో వివిధ రకాల వ్యాపారాలకు సంబంధించి సుమారు 10 వేల సముదాయాలు ఉండగా.. వాటిల్లో మూడు వేల వ్యాపారసంస్థలకే లైసెన్సు ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారం నిర్వహించే ప్రతీ ఒక్కరు ట్రేడ్‌లైసెన్సు కలిగి ఉండాలని కేఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా లైసెన్సులు జారీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం ట్రేడ్ లైసెన్సు జారీ చేయాలంటే వ్యాపార భవనం కొలతలను అధికారులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. ఆపై ఫీజు ఖరారు చేస్తారు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు యజమానులతో కుమ్మక్కై దుకాణాల భవనాలకు కొలతలను తక్కువగా నమోదు చేసి ఫీజు తగ్గిస్తున్నారు. ఇందుకోసం కొంత డబ్బు వసూలు చేస్తుండగా కేఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.



నగరంలోని వైరా రోడ్డులో కోర్టు సమీపాన ఉన్న దుకాణాలకు సంబంధించిన ట్రేడ్‌లైసెన్సుల జారీ బాధ్యతలను కేఎంసీ అధికారులు ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ)కు కేటాయించారు. ఓ కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు సహాయకుడు ఆయన పరిధిలోని షాపులను కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశాక ట్రేడ్ లైసెన్సులు జారీ చేసి ఫీజు కట్టించుకోవాల్సి ఉంటుంది. కానీ సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల దుకాణాల కొలతలు తీసుకునేందుకు వెళ్లిన కంప్యూటర్ ఆపరేటర్‌తో యజమానిని తన వద్దకు పంపించాలని చెప్పినట్లు సమాచారం. తనతో మాట్లాడాకే ఫీజు ఫైనల్ చేస్తానని చెప్పడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ – కంప్యూటర్ ఆపరేటర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

**మామూళ్ల కోసం..**

పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వర్తించే శానిటరీ ఇన్‌స్పెక్టర్లలో కొందరు మామూళ్లకు ఆశ పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కార్మికుల నుండి వసూలు చేసే వీరు ఇప్పుడు అధికారులు అప్పగించిన బాధ్యతను పెత్తనంగా భావిస్తూ అజమాయిషీ చెలాయిస్తున్నారు. లైసెన్సు ఫీజులు తగ్గించేందుకు కొంత నగదు ఇవ్వాలని నేరుగా యజమానులనే డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇస్తే ఫీజు తగ్గేలా కొలతలు మార్చి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇక ట్రేడ్ లైసెన్సుల జారీకి తామే బాస్‌లమని, తాము నిర్ణయించిందే ఫీజు అని మొహమాటం లేకుండా యజమానులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇక కొలతల సమయాన సిబ్బంది తమ మాట వినకపోతే గొడవకు సైతం దిగుతున్నారు. తాము చెప్పినట్లు పని చేయకుంటే విధుల నుంచి పక్కన పెట్టిస్తామని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు, కంప్యూటర్ ఆపరేటర్‌కు మధ్య జరిగిన గొడవపై కేఎంసీలో చర్చ జరుగుతోంది.

**ఫిర్యాదు అందితే పరిశీలిస్తాం..**

కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుకొలతలు తగ్గించి లైసెన్సులు జారీ చేస్తున్నారనేది తమ దృష్టికి రాలేదని కేఎంసీ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కొన్ని లైసెన్సులను పరిశీలించి ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదులు అందితే సంబంధిత షాపుల కొలతలు మళ్లీ వేయిస్తామని పేర్కొన్నారు.

## 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వంగూరి రాములు

**ఖమ్మంమయూరిసెంటర్:** హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మంచికంటి భవనంలో జరిగిన జిల్లా ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాభైఐదేళ్లు పైబడిన హమాలీలకు నెలకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని, అన్ని రకాల హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం, గుర్తింపు కార్డులు, సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో సంబంధం ఉన్న మార్కెట్ యార్డ్, సివిల్ సప్లై, బేవరేజెస్, ఎఫ్‌సీఐ, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లలో పని చేసే వారిని నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుషాకుల లింగయ్య, జిల్లా నాయకులు మండల వీరస్వామి, సోమనబోయిన వెంకటేశ్వర్లు, ఈగ మల్లారెడ్డి, మద్ది శ్రీను, మట్టిపల్లి వెంకన్న, కోడి వెంకన్న, ఏ వెంకటేశ్వర్లు, శ్రీశైలం, కృష్ణ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ నిరసన ర్యాలీని..



తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న ఇజ్రాయిల్

**తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్:** రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొనే ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మందడి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పాతర్లపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే నేడు(సోమవారం) టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి మయూరిసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించబడుతుందని పీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లో తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయనే ఆశతో నిరుద్యోగులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుని ప్రిపేర్ అయి పరీక్ష రాస్తే టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని వాపోయారు.పేపర్ లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగులు మద్దతు తెలిపి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాజా సత్యనారాయణ, నాయకులు మల్లయ్య, వెంకటేశ్వర్లు, రాములు, భాస్కర్, సోమయ్య, రాంబాబు, శ్రీనివాస్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో కార్మికులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

**నేలకొండపల్లి:** కార్మికుల పట్ల కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య ఆరోపించారు. నేలకొండపల్లిలో ఆదివారం నిర్వహించిన ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనాల చట్టం కూడా అమలు చేయటం లేదని పేర్కొన్నారు.కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వెంటనే రెగ్యులరైజేషన్ కోసం ఉద్యమించాలని, చికాగో కార్మికుల స్ఫూర్తితో పాలక ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, గోసు పుల్లయ్య, శీలం లెనిన్, ఆర్.రామదాసు, జి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

**ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి:** ఇళ్లు, ఇళ్ల స్థలం లేని పేదలకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీవై పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూంలను వెంటనే లబ్ధిదారులకు పంచాలని నేడు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో ఇంటింటా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, మలీదు నాగేశ్వరరావు, పీవైఎల్ డివిజన్ కార్యదర్శి బచ్చలకూరి వెంకటేశ్వర్లు, స్టీవెన్, వీరయ్య, నారాయణ, యేసుమణి, జి.రామయ్య, తుడుం ఝాన్సీ, ఆవుల మంగతాయి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోరట్లగూడెంలో సంతకాలసేకరణ చేస్తున్న పుల్లయ్య

### డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించొద్దు

**ఖమ్మంమయూరిసెంటర్:** జీవ శాస్త్ర అధ్యాయానికి, జీవ పరిణామక్రమ అధ్యాయానికి తోడ్పడే డార్విన్ సిద్ధాంతాన్ని కేంద్ర ఉన్నత పాఠ్య ప్రణాళిక బోర్డు తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీ మూడ నమ్మకాలు, మత విశ్వాసాలను రామాయణ, మహాభారత ఇతిహాస కల్పిత కథలను పాఠ్యాంశాలుగా పెట్టి మత భావాలను పాఠ్యాంశాలలో తీసుకురావడం ద్వారా విద్యను కాషాయికరణ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సంఘ నాయకులు రాజు, నరేష్, సతీష్, గోపి, వెంకటేష్, చందూలాల్, మధు, నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### సత్యనారాయణ ఆదర్శప్రాయుడు

**ఖమ్మం సహకారనగర్:** ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శెట్టిపల్లి సత్యనారాయణ అందరికి ఆదర్శప్రాయుడని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. ఆయన సంస్మరణ సభను నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా డీఈఓ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మోత్కూరి మధు, కృష్ణమోహన్, సుదర్శన్‌రెడ్డి, పుల్లయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### 'బొమ్మా'కు సన్మానం



సన్మానం చేస్తున్న సంఘం బాధ్యులు

**ఖమ్మం మామిళ్లగూడెం:** ముస్తఫానగర్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ సంఘాల సమావేశంలో బీసీ సంఘ నేతలను దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బీసీ సంఘం సీనియర్ నాయకుడు బొమ్మా రాజేశ్వరావుతో పాటు ఇటీవల పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గజవెల్లి సత్యనారాయణ, బీసీ, ఎంబీసీ, సంచార జాతుల నాయకులు, బీజెటీసీలో ర్యాంక్ సాధించిన షేక్ రెష్మాను సన్మానించారు. ఎంబీసీ రాష్ట్ర కో కన్వీనర్, బీఆర్‌ఎస్ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దాసాహేబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకల సుగుణరావు, ఎండీ తాజుద్దీన్, కత్తి నెహ్రూ, సోమరాజు, వెంకటరమణ, శ్రీను, ఖిజరుల్లా, షర్మిల, యాఖుబ్ బాబా, సైదులు, రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

### 'అన్నం'కు పోలీసులు..



అన్నం శ్రీనివాసరావును సన్మానిస్తున్న సీఐ రాజిరెడ్డి

**ఖమ్మంరూరల్:** అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు గత కొన్నేళ్లుగా చేస్తున్న సమాజ సేవను అభినందిస్తూ రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ వెంకటకృష్ణ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అనాథల ఆకలి కోసం అవసరాల కోసం అందరూ పోలీస్ సిబ్బంది కలిసి రూ.21వేలను వితరణ చేశారు.

### మాన్వి ప్రతిభ



మాన్వికి అవార్డు అందిస్తున్న సంస్థ బాధ్యులు

**ఖమ్మం అర్బన్:** నగరానికి చెందిన డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, అనితారావు కుమార్తె మాన్వి కర్ణాటకలోని మైసూర్ జగన్మోహన్‌రావు ప్యాలెస్‌లో శని, ఆదివారాల్లో కల్ప శ్రీసమస్త నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు సంస్థ బాధ్యులు మాన్వికి అవార్డు, సర్టిఫికెట్‌ను అందించి అభినందించారు.

### ఎమ్మెల్యే చిత్రపటం బహూకరణ

**కూసుమంచి:** మండలంలోని మల్లాయిగూడెం శివారు రాజుతండాకు చెందిన పోలీస్ ఉద్యోగి అయిన వాంక్‌డోత్ శంకర్ కుమార్తె సుప్రియ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చిత్రపటాన్ని స్వయంగా తన చేతులతో గీసి ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి బహూకరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు బాదావత్ రవి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మ బసవేశ్వర జయంతోత్సవం

**ఖమ్మంమయూరిసెంటర్:** వీర శైవ లింగాయత్ సంఘం సభ్యుడు శ్రీ మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. వీర శైవ జంగం జిల్లా వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఏటీఓ టీవీ ప్రసాద్ మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీర శైవ జంగం జిల్లా అధ్యక్షుడు ముగ్గు అమర్నాథ్, మహిళా అధ్యక్షురాలు విభూది మల్లిక, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.నాగేశ్వరరావు, ఎం.రవి, రోషేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వడగళ్ల వాన బీభత్సం

మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానకు పలు గ్రామాల్లోని రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం తడవగా.. బొప్పాయి, మామిడి తోటలకు తీవ్ర నష్టం కలిగింది. పలుచోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, ఇటీవల కాలం వరకు వర్షం కురిసిన సమయంలో ఎప్పుడో ఒక సారి వడగళ్లు పడగా.. ఈ సారి మాత్రం వర్షం కురిసినంత సేపు వడగళ్లు పడడంతో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

– సాక్షినెట్‌వర్క్



వడగళ్లను చూపిస్తున్న దృశ్యం



ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని వైరారోడ్‌లో కురుస్తున్న వాన



నేలకొండపల్లి: తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు



రఘునాథపాలెం: దెబ్బతిన్న బొప్పాయి తోట



ఖమ్మంగాంధీచౌక్: ఖాళీ ప్రదేశంలో వడగళ్లు



నేలకొండపల్లిలో కూలిన ఫ్లెక్సీ



నేలకొండపల్లి: బైరవునిపల్లిలో వర్షపు నీటిని తోడుతున్న మహిళా రైతు

### అటెన్షన్ ప్లీజ్

## ఆగని అక్రమ నిర్మాణాలు..!



మండలంలోని పంగిడి గ్రామంలోని గతంలో ప్రభుత్వ పాఠశాల నిర్వహించిన స్థలం నిరుపయోగంగా ఉండగా.. ఆ స్థలంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్, ఎంఈఓలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమగ్ర వివరాలు పరిశీలించేంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సంబంధిత వ్యక్తిని ఆదేశించినా.. ఇదిగో ఇలా ఇంటి నిర్మాణం చేస్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు విచారణ చేసి అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

- రఘునాథపాలెం